నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 03 జూన్ 2024 | www.navatelangana.com

పాటల సీడీని ఆవిష్కరించిన నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిలపై రూపొందించిన పాటల సీడీలను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆవిష్కరించారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని వేముల గట్టుకు చెందిన కాంగ్రెస్ నాయకులు వరద నాగరాజు ఈ పాటలు రికార్డును చేయించారు. అయితే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేముల గట్టుకు వెళ్లిన నర్సారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూంరెడ్డి, నాయకపు భాస్కర్, రాజు, నాగరాజు గౌడ్, నాయకుము , సమీర్ తదితరులు ఉన్నారు.

జహీరాబాద్‌లో ఈదురు గాలులతో వర్షం





నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో వర్షం పడింది. గత కొన్ని రోజులగా విపరీతమైన ఎండతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం.. సాయంత్రం పూట వర్షానికి సేద తీరారు. గత వారం రోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉండడంతో.. వయో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే అనారోగ్యాలతో బాధపడుతూ వైద్యశాలల్లో చేరా ల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయ ంత్రం చిరుజల్లులతో కూడిన మోస్తారు వర్షం కురవడంతో చిన్నారులు, యువతీ యువకులు కేరింతలతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. మోస్తారు వర్షంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి.



అంటరానితనానికి నిదర్శనమే సీతారాం పల్లి

గ్రామాన్ని సందర్శించిన మానవ హక్కుల వేదిక బృందం..
మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

అంటరానితనానికి నిదర్శనంగా సీతారాంపల్లి గ్రామాన్ని చెప్పవచ్చని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు వ్యక్తులు హనుమాన్ మాల ధరించి గుడిలోకి ప్రవేశించకుండా అగ్ర కులస్తులు వివక్ష చూపారని కేసు నమోదు అయిన నేపథ్యంలో మానవ హక్కుల వేదిక బృందం గ్రామాన్ని సందర్శించి బాధితులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింత మడక గ్రామానికి ఆమ్లెట్‌గా ఉండి, అనంతరం స్వతంత్ర జీపి అయిన సీతారాం పల్లి గ్రామంలో దాదాపు వెయ్యి మంది జనాభా ఉంది. సుమారు 80 కుటుంబాలు దళితులవి కాగా, 100 కుటుంబాల వరకు ఇతర కులస్తులు ఉన్నారు. ఈ సంవత్సరం ఐదుగురు దళిత యువకులు హనుమాన్ మాలలు వేశారు. మే 28వ తేదీన సాయంత్రం మాల ధరించి హనుమాన్ గుడికి వచ్చిన ఐదుగురు దళిత యువకులకు. మాల ధరించిన ఇతర కులస్తులకు మధ్యన గుడిలోకి ప్రవేశించే విషయంలో వివాదం చెలరేగింది. ఈ విషయంలో అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి కల్పించుకొని మాల ధరించిన దళిత యువకునికి ఫోన్ చేసి దళితులు గ్రామస్తులకు చెందిన గుడిలోకి రావడం ఎప్పుడు జరగ లేదని, అలా రాకూడదని హెచ్చరించిన, కులం పేరుతో దూషించినట్టు బాధితు లు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో మిట్టపల్లి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామా నికి చెందిన ఇద్దరు రెడ్డి కులస్తులను ఒక గౌడ కులస్తుని పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు కూడా పంపడం జరిగింది. ప్రజల మధ్య ఉన్న సాంస్కృతిక, సామాజిక వైరుధ్యాలను ప్రభుత్వాలు పెంచి పోషించు కుంటూ వస్తున్నాయి. ప్రజలకు తమ కులం పట్ల ఉండే వేర్పాటువాద భావాన్ని పెంచుకునే కుల సంఘాలను పోటీపడి ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా, ప్రజల మధ్య ఉన్న సామాజిక అంతరాలు తగ్గటం కాకుండా రోజురోజుకూ మరింతగా పెరుగుతున్నాయని తిరుపతయ్య స్పష్టం చేశారు. సీతారాం పల్లిలో వివక్ష పాటిం చిన వ్యక్తులపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని, సమా జంలో అంటరానితనము, కులవివక్ష అంతరించేటట్టు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్ర మాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా తమ మధ్య సోదరభావం పెంపొందించుకుంటూ మతతత్వం, కులతత్వాలకు తావు ఇవ్వకుండా మాన వత్వమే మౌలిక ప్రమాణంగా ఐక్యంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక సభ్యులు వనపాకల దిలీప్, ఎస్ అచ్యుత్ కుమార్, మారముల్ల కిరణ్, కొత్తూరు కుమార్, చైతన్యతదితరులు పాల్గొన్నారు.



పెట్టుబడిదారి సమాజం ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుంది

- ప్రజల పక్షాన నిలిచి పోరాడేది ఎర్రజెండే
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్
- ముగిసిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

నవతెలంగాణ-సంగారెడ్డి

ఈ భూప్రపంచం పై పెట్టుబడిదారీ సమాజం ఉన్నంత కాలం అణగారిన వర్గాల పక్షాన పోరాడేందుకు ఎర్రజెండా ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ అన్నారు. గత రెండు రోజులుగా జరుగుతున్న సీపీ ఐ(ఎం) రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ భూప్రపంచంపై పెట్టుబడిదారీ వ్యవస్థ తన స్థానాన్ని సుస్థి రం చేసుకోవడానికి పీడిత ప్రజలను దోపిడీ చేస్తూనే ఉంటుందని.. అలా దోపిడీకి పీడనకు అణచివేతకు గురవుతున్న జాతుల గురించి పోరాడేందుకు ఎర్ర జెండా రూపంలో సీపీ ఐ(ఎం) అగ్ర భాగాన ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారి సమాజం తిరోగమనంలో ఉందని పెట్టుబడిదారీ విధానం అమలులో ఉన్న దేశాల్లో ఆర్థిక రాజ కీయ సామాజిక అసమానతలు పెరిగిపోయాయన్నారు. తీవ్ర ఆర్థిక మాంద్యంతో ఉన్న నేటి దేశాలు సైతం దాస్ క్యాపిటల్‌ని అనుకరిస్తున్నారన్నారు. పెట్టుబడుదారి సమాజం ఏన్నటికి సమానతను సాధించలేదని అసమా నతలు పెం పొందించడమే దాని ప్రధాన ఉద్దేశమన్నారు. సీపీఐ(ఎం)కు ఓట్లు.. సీట్లు ప్రధాన అంశాలు కావని, పీడి తుల పక్షాన చట్ట సభలలో వాణి వినిపించేందుకు ఒక మార్గం మాత్రమే అన్నారు. చట్టబద్ధ రాజ్యాంగ బద్ధ పద వులు తమకు కొలమ నాలు కాదని.. దోపిడీ పీడన లేని సమాజం తమ అంతిమ లక్ష్యమన్నారు. సైదాంతిక అవగాహనతో శాస్త్రీయ సమా జం వైపు అడుగులు వేస్తూ అస్థిత్వ ఉద్యమాలకు దూరంగా అనగారిన జాతులకు అండగా పోరాటం చేసేది సీపీఐ(ఎం) మాత్రమే అన్నారు. 75 ఏండ్ల స్వతంత్ర భారతం ఇంకా మౌలిక వసతుల గురించి హామీల ఇచ్చే దౌర్భాగ్య స్థితిలో ఉండటానికి పాలకుల నయా ఉదారవాద విధానాలే కారణమన్నారు. దేశ రాజకీయాలు వ్యక్తుల చేతులలో నుంచి కార్పొరేట్ కంపెనీల చేతులలోకి వెళ్లిందని.. రాజకీయ కార్పొరేటికరణ జరిగి భారత ప్రజాస్వామ్య వ్యవస్థకే హాని జరిగే అవకాశం ఉందన్నారు. సంపదను కేంద్రీకృతం చేసి దేశాభివృద్ధిని వెనక్కి నెట్టేస్తున్న మతోన్మాదులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) చేసే పోరాటాలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, కార్య దర్శివర్గ సభ్యులు మానిక్, రాజయ్య, సాయిలు జిల్లా కమి టీ సభ్యులు విద్య సాగర్, మహిపాల్, యాదగిరి నాయకులు పండురంగారెడ్డి, నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

భూవివాదాల్లో ఇతరులు జోక్యం చేసుకోవద్దు



నవతెలంగాణ-జహీరాబాద్

భూ వివాదాల్లో ఇతర వ్యక్తులు గానీ, గ్రూపులు గానీ జోక్యం చేసుకోవద్దని సీఐ రాజబోయిన రవి హెచ్చరించారు. ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ చుట్టుపక్కల గ్రామాలు అనగా కోహిర్, మొగుడం పల్లి, జహీరాబాద్ మండల్లాలో కొందరు గ్యాంగులుగా ఏర్పడి వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు, భూ క్రయ, విక్రయాల విషయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతునట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. భూ తగాదాల విషయంలో రియల్ ఎస్టేట్ దందాలు, సెటిల్‌మెంట్లు చేయడం, ప్రజల ధన ప్రాణ మాన సుఖశాంతులకు భంగం కలిగించడం చట్టరీత్యా నేరవన్నారు. అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పిడి యాక్టు కింద కేసు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. చేస్తామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే కేసులన్నీ దాదాపు భూ వివాదాలకు సంబంధించినవే వుంటున్నాయన్నారు. అయితే భూ వివాదాలను పోలీసులు పరిష్కరించరన్నారు. అయితే గ్రామాల్లో అమాయక ప్రజలను రియలఎస్టేట్ వ్యాపారులు బెదిరింపులకు గురి చేస్తున్నారని, దందాలతో ఇబ్బందులు పెడుతున్నారని.. దాంతో ప్రజలు పోలీస్‌లను ఆశ్రయిస్తున్నారన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని, భూ తాగాదాలు కేసులన్నీ సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశం లో జహీరాబాద్ టౌన్ సర్కిల్ ఎస్ఐలు లక్ష్మారెడ్డి, ప్రసాద్, కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మేలురకం విత్తనాలతో..

దిగుబడి భేష్..



- రైతులకు తప్పనిసరిగా మేలు రకం విత్తనాలనే కొనుగోలు చేయాలి
- నకిలీలకు చెక్ పెట్టేందుకు అధికారుల ఫోకస్
- సోయా, కంది, పెసర, మినుము విత్తనాలను అందించాలని రైతుల డిమాండ్

నవతెలంగాణ-ఝరాసంగం

వానకాలం సీజన్ వచ్చిందని ఆగమాగం కాకూడదు. సాగులో విత్తనాలు ఎంపికే అత్యంత కీలకం. రైతులారా.. ఎలాంటి విచారణ లేకుండా తొందరపడి విత్తనాలు కొను గోలు చేసి మోసపోవద్దు. తొందరపాటుతో నష్టాలు మిగుల్చుకోవద్దు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులు తెలుసుకుని విత్తనాలు ఎంపిక చేసుకుంటే మేలు. ప్రభుత్వం సాగుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవసరమైన కొన్ని విత్తనాలను (జనుములు) సొసైటీల ద్వారా పంపిణీ చేస్తున్నది. గతంలో ఎప్పుడూ విత్తనాలు అమ్మనివారి వద్ద విత్తనాల కొనుగోలు అంత మంచిది కాదు. వారితో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా గ్రామాలకు వ చ్చి ఊరు, పేరు లేని కంపెనీల విత్తనాలను అంటగట్టే అవ కాశం లేకపోలేదు.ఇలాంటి కొనుగోళ్ల వల్ల సాగు సమ యం లో అనుకోని నష్టాలు వస్తే ఎవరినీ జవాబుదారీ చేయ లేని పరిస్థితులు ఎదురవుతాయి. ఏఓ, ఏఈఓ సలహాల తోపాటు స్థానిక డీలర్ల వద్ద రసీదులు తీసుకొని కొనుగోలు చేయడం వల్ల విత్తిన తర్వాత మొలకెత్తనీ సమయంలో డీలర్లను గాని, అధికారులనుగాని ప్రశ్నించేందుకు ఆస్కారం ఉంటుంది.

విత్తనాల ఎంపికే ఉత్తమం..

పంటసాగులో విత్తనాల ఎంపికే ప్రధానం. దాదాపు విత్తన సంస్థలు వందల రకాల విత్తనాలను మార్కెట్‌లో సిద్ధంగా ఉంచ ుతున్నారు. ఆయా కంపనీల డీలర్లు రైతులను ఆకట్టుకునేలా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఏ కంపనీ నాణ్యమైన విత్తనాలు అందిస్తుందనే విషయంలో రైతులకు అవగాహన లేకుండా పోతోంది. మండలంలో యేటా సోయా, పత్తి విత్తనాలు మొలకెత్తక, మొలకెత్తిన విత్తనం కాత రాకపోవడం, కాయలు మొలకలు రావడం జరుగుతోంది. దీనికి విత్తనలోపం కొంత వరకు ఉన్నా దానికి వాతావరణ పరిస్థితులు సహకరించడం లేదు. సరైన సమయంలో వర్షాలు కురియక గణనీయంగా దిగుడబడులు తగ్గిపోవడం ఓ కారణంగా చెప్పవచ్చు. ప్రతి సంవత్సరం ఏదో ఒక రకం కంపెనీ విత్తనాలు వేసుకునే కంటే నాణ్య మైన విత్తనాలను రైతులే ఉత్పత్తి చేసుకుంటే ఎంతో మేలు ఉంటుంది. ఇటీవల కాలంలో పత్తిసాగు చేస్తున్న రైతులను అక్రమా ర్కులు ఆశచూపుతూ నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. విత్తనాల ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకొన్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చు.

నకిలీ విత్తనాల సరఫరాపై ఫోకస్

నకిలీ విత్తనాలను నివారించేందుకు క్లస్టర్ల వారిగా వ్యవసాయ విస్తరణ అధికారులతో రైతులను చైతన్యపరిచేందుకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం. ప్రభుత్వం నుంచి లైసెన్సుడ్ కలిగిన అధికృత డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచిస్తున్నాం. విత్తనాలను కొనేముందు వాటి రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరు చుకోవాలనీ తెలియజేస్తున్నాం. పత్తి విత్త నాలు ఎంఆర్పి కంటే ఎక్కువ ధరలకు అమ్మిన, లూజ్ విత్తనాలు ఎవరైనా అమ్మిన వెంటనే వ్యవసాయ అధికారులకు గాని, పోలీసులకు గాని నేరుగా ఫిర్యాదు చేయాలి.

– వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి, ఝరాసంగం



ప్రధాన పంటగా పత్తి సాగు..

మండలంలో పత్తి ప్రధాన పంటగ సాగవుతోంది. 2024–25 ఖరీఫ్ సీజన్లో 27,600 ఎకరాలలో పత్తి పంట సాగాయే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందుకు 40 వేల క్వింటాళ్ల పత్తి విత్తనాలు అవసరం కాగా.. మండలంలోని సి డీలర్ల వద్ద 22 వేల పత్తి ప్యాకెట్లు అందుబాటులో ఉన్నయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే 12 వేల పత్తి ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఇక రెండో పంటగా సోయా 3600 ఎకరాలలో సాగు కాలినట్లు అంచనా వేశారు. ఈ పంట సాగు కు సంబ ంధించి వేయి క్వింటాళ్ల విత్త నాలు అవసరం. అయితే గత రెండేండ్ల నుంచి ప్రభుత్వం ఈ విత్త నాలను రైతులకు అందించడం లేదు. రైతుల నుండి డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ విత్తనాలను అందించకపోవడంతో పక్క రాష్ట్రమైన కర్ణాటక నుంచి లూజ్ విత్తనాలను రైతులు కొనుగోలు చేసి అత్యధికంగా నష్టపోతున్నారు. రైతుల నుండి అధికంగా డిమాండ్ ఉండడంతో అక్కడి దళారులు అందిన కాడికి దోచ ుకుంటున్న పరిస్థితులు నెలకొం టున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా సోయా కంది పెసర మినుము వంటి విత్తనాలను అందించాలని రైతులు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులతో మేలు..

పత్తి విత్తనాలను విత్తుకోవడానికి ముందు కొన్ని రకాల రసాయన ఎరువులను ప్రస్తుతం అత్యధికంగా రైతులు వాడు తున్న పరిస్థితి ఉంది. దీనికి బదులు సేంద్రియ ఎరువులు వాడడం వల్ల అవి నేలలో కుల్లి భూమి పొరల్లో ఎరువుగా మారి పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలను అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక జీవగుణాలపై ప్రభావం చూపి నేల సత్తువ ఉత్పాదక శక్తిని పెంచుతాయి. పశువులు, కోళ్లు, గొర్రెలు, వానపాముల ఎరువులను ఎకరానికి సుమారు 2–4టన్నుల వరకు వాడవచ్చు. విత్తడానికి 20–25రోజుల ముందు సేంద్రియ ఎరువు వేసి భూమిలో కలియదున్నాలి. సేంద్రియ పదార్థం వేయడం వలన భూమి గట్టి పడకుండా గుల్లగా ఉంటుంది. నీరు బాగా ఇంకడం వల్ల భూమిలో తేమ గణనీయంగా పెరిగి విత్తనం బాగా మొలకెత్తుతుంది. దీంతో దిగుబడి ఎక్కు వగా వచ్చే అవకాశం లేకపోలేదు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

- దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చిన నాయకుడు కేసీఆర్..
- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తుందని అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి విరుచుకుపడ్డారు. ఆదివారం 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ తెలంగాణ సాధించిన తెలంగాణ మహనీయులు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని చిహ్నాలు అయిన కాకతీయుల వారి కళాతోరణం, చార్మినార్ గుర్తులను రాష్ట్ర ప్రభుత్వం తొలగిస్తామనడం చాలా దారుణమన్నారు. కాంగ్రెస్ పాలించే విధానం ప్రజాపాలన కాకుండా రాక్షస పాలనగా మారిందన్నారు. ఎంతసేపు గత ప్రభుత్వంపై బురదలు చల్లడానికి గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై నిందలు మోపడానికి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన చిహ్నాలను తొలగించడానికి మాత్రమే సమయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయిస్తుందని మండిపడ్డారు. కానీ ప్రజాపాలన అంటూ అడుగడుగున ప్రజలను రైతులను వ్యాపారవేత్తలను అణచి వేసే ఆర్థికపరమైన కుట్రలకు కాంగ్రెస్ పార్టీ పాల్పడుతుందని మండిపడ్డారు. కాకతీయ కళాతోరణం చార్మినార్ తోరణం చేసిన మార్పు ప్రజా పాలనలో తప్పులకు నిదర్శనమన్నారు. వ్యవసాయం నీళ్లకు కాకతీయ కళాతోరణం, వైద్యం సంక్షేమానికి చార్మినార్ చిహ్నం అన్నారు. తెలంగాణ రాజముద్రను మార్చడం దుర్మార్గం, క్రూరమైన ఆలోచన అన్నారు. తెలంగాణ ఆత్మపై దెబ్బ కొట్టడమే అన్నారు. ఢిల్లీపై ధిక్కారానికి ప్రతీక కాకతీయ కళాతోరణమన్నారు. గత దశాబ్దాల క్రితం ప్లేగు వ్యాధి వ్యాపిస్తున్నప్పుడు ఆ మహమ్మారిని నివారించేందుకు నివారణకు గుర్తుగా కుతుబ్షాహీలు నిర్మించినది చార్మినార్ అన్నారు.

కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నాలను తొలగిస్తే ఊరుకునేది లేదన్నారు. అధికారం ఎప్పుడు శాశ్వతం కాదన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక దిశగా అడుగులు వేస్తున్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో విధ్వంసానికి గురైన అనేక రంగాలు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పునర్జీవం దిశగా అడుగులు పడితే వాటిని ఛిద్రం చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలు ఉన్నాయన్నారు. దమ్ముంటే రాజకీయాన్ని రాజకీయపరంగానే ఎదుర్కోవాలన్నారు. కానీ ఇలాంటి చిహ్నాలను తొలగించడం హేయనీయమైన చర్యగా, సిగ్గుమాలిన పిరికిమాలిన చర్యగా ఆయన పేర్కొన్నారు.

ఆంధ్ర నాయకులకు వత్తాసు పలికే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి విధానాలు ఉన్నాయన్నారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలందరికీ రాజకీయాలతో సంబంధం లేకుండా తెలంగాణ రాష్ట్ర చరిత్రను తెలంగాణ రాష్ట్ర చిహ్నాలను కాపాడుకొని తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలోనే భారతదేశంలో ముందు వరసలో ఉంచిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆనవాళ్ళని చెరిపి ఢిల్లీ నాయకులకు గులాములుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆంధ్ర వారి చేతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ సాధించేందుకు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎన్నో ఉద్యమాలు చేపట్టి ఢిల్లీ ప్రభుత్వ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారన్నారు. తెలంగాణను సాధించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో ప్రజా రంజక పాలన గత పది సంవత్సరాలుగా కేసీఆర్ అందించారన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నాయకుల మధ్య సమన్వయ లోపంతో ఎవరికి వారే నిర్ణయాలు తీసుకొని ప్రజల రైతుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. గజ్వేల్ పట్టణంలో నియోజకవర్గంలో కేసీఆర్ పిలుపుమేరకు దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పట్ల మేధావులు, బుద్ధి జీవులలో, ప్రజలలో తీవ్రమైన ఆందోళన కలిగించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉందని మండిపడ్డారు. ప్రజలతో మేధావులతో రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా నిలబడలేదన్నారు.

అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ ఏర్పాటు

- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

ఎందరో అమరుల ప్రాణ త్యాగ ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రాహుల్ రాజ్‌ను పోలీసులు గౌరవ వందనంతో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద పూల మాలలు వేసి అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం జిల్లా ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేష్, ఆర్డీవో రమాదేవి, డిఆర్ఓ పద్మశ్రీ వివిధ శాఖల అధికారులు, పుర ప్రముఖులతో కలిసి జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటాలలో అమరులైన వారిని స్మరించుకుంటూ కలెక్టర్ ప్రసంగించారు. తెలంగాణ సాధించిన ఘనతను నలుదిక్కులా చాటేలా, ప్రత్యేక రాష్ట్రం ద్వారా ప్రజల జీవితంలో వచ్చిన మార్పు తెలియజేసేలా రాష్ట్ర దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రాముఖ్యతను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పల్లెల్లో వివరిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమకారులు ఉద్యమంలో కీలక పాత్ర పోషించడం, ఎందరో మహనుభావుల ప్రాణ త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైందని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ పదో వసంతంలోకి అడుగుపెట్టిన చారిత్రక సందర్భంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయి ంచిందని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. మెదక్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథం లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక సారథి, కళాకారుల ఆటా పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలవేసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలకు డిక్షనరీలు, నోట్ బుక్‌లను, పెన్నులను అందించారు. అనంతరం ప్రజలు అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తు తెలంగాణ ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయి 11 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని తెలంగాణ ఉద్యమ తొలి, మలిదశ అమరవీరులకు నివాళులర్పిస్తున్నట్టు తెలిపారు. ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ అన్ని రంగాల్లో దశ దిశల వెలుగు విరిజిమ్ముతు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, తెలంగాణ అనేది ఒక భౌగోళిక స్వరూపం మాత్రమే కాదని తెలంగాణ ఒక అస్తిత్వ పోరాటానికి రూపమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సిద్దిపేట జిల్లా ప్రజల చాలా ముఖ్యమైనదని గర్వంగా చెప్తున్నానన్నారు. అనాదిగా సిద్దిపేట కవులకు, మేధావులకు నిలయమని, జిల్లాలో సాంస్కృతిక సాహిత్య చైతన్యం అధికంగా ఉంటుందని అన్నా రు. ఆ ప్రభావంతో సిద్దిపేట ప్రజలు తొలి దశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో నాయకత్వం వహించి అనేక తెలంగాణ ఉద్యమ పోరాటాలలో ముందు నిలిచి తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన భూమిక పోషించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో జిల్లాలోని ప్రజ లు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ ఎప్పుడు అగ్ర స్థానం లోనే నిలవాలని ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ వేడుకలలో కమిషనర్ పోలీస్ డాక్టర్. అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు వివిధ శాఖల సిబ్బంది కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

- నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అరికట్టాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

ప్రభుత్వం అన్ని రకాల దాన్యానికి బోనస్ ఇవ్వాలని, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యాలయంలో కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ ప్రభుత్వం ఒకే రకం ధాన్యానికి బోనస్ ఇస్తాననడం సరైనది కాదన్నారు. అన్ని రకాల ధాన్యానికి సబ్సిడీ ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. అలాగే ఈ వ్యవసాయ సీజన్లో అనేకచోట్ల నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్ముతూ రైతాంగాన్ని మోసం చేస్తున్నారన్నారు. వాటిని అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి ఈ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు వెంటనే ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపల రుణమాఫీ చేసి, కొత్తగా పంట రుణాలను ఇచ్చి రైతాంగన్ని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం రైతు రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. రైతాంగానికి పంటల పెట్టుబడి సహాయం రైతు భరోసాను వ్యవసాయ సీజన్లో ముందే అందించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పంటలకు బీమా సౌకర్యం కనీస మద్దతు ధరలు లభించే విధంగా రైతాంగానికి చేయూతనివ్వాలని, తద్వారా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ హామీల అమలు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గోడ్డు బర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకటమావో, చొప్పరి రవికుమార్, బద్దిపడగ కృష్ణారెడ్డి, అమ్ముల బాల నరసయ్య, తిప్పారపు శ్రీనివాస్, దాసరి ప్రశాంత్, అత్తిని శారద, సింగిరెడ్డి నవీన, తాడూరు రవీందర్, జాలిగాపప్ప శిరీష తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో యన్.గిరిధర్ రెడ్డి

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో టీఎస్ ఐడీసీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్‌తో కలసి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి పాల్గొని జెండా ఆవిష్కరిం చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ..ఎంతోమంది విద్యార్థులు, పోరాట యోధుల బలిదానంగా రాష్ట్రం ఏర్పాటైందని.. వరి ఆశయాలు నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్న దన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఎంపీఓ మహేష్, జెడ్పీ టీసీ నాగిశెట్టి, ఎంపీటీసీలు, మాజీ మున్సిపల్ చైర్మెన్లు మహంకాల్ సుభాష్ గుప్తా, మాజీ కౌన్సిలర్లు జహంగీర్, రాములు నేత, మోతిరాం, యూనివర్స్, అత్తర్ గౌరీ , శేఖర్ మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం

నవతెలంగాణ-సంగారెడ్డి



కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరని హామీలు ఇచ్చి గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల తరపున పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరహరి, మందుల వర లక్ష్మివెంకటేశ్వర్లు, నరసింహులు,రామప్ప, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి,చక్రపాణి, విట్టల్, అశ్విన్, శైలేందర్, శ్రవణ్, వాజీద్, పరశురాం, గౌతంరెడ్డి, చంద్రకాంత్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కానరాని ఉత్సవాలు..

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని వివిధ పరిశ్రమల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవ ఉత్సవాలు ఎక్కడ కూడా కనిపించ లేదు. కనీసం జెండాను కూడా ఆవిష్కరించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో వారం రోజుల పాటు ఆయా పరిశ్రమల్లో పండగ వాతావరణంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించిన విషయం విధితమే. కానీ ఈసారి ఎక్కడ కూడా రాష్ట్ర అవతరణ ఉత్సవాలు జరుపకపోగా కార్మికులకు సైతం సెలవులు ప్రకటించలేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుచున్నారు.



'అన్నదాత' ఫర్టిలైజర్ దుకాణంలో అధికారుల తనిఖీలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

'అన్నదాత' ఫర్టిలైజర్ దుకాణంలో బ్లాక్‌లో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆర్డిఓ అశోక చక్రవర్తి, అగ్రికల్చర్ ఏఓ శంకర్, సీఐ శ్రీనివాస్ రెడ్డిలు ఆదివారం ఆ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి గ్రౌండ్ వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని.. ప్యాకెట్‌లో కొంచెం క్యాంటీటీలో ఎక్కువ తక్కువ వచ్చాయన్నారు. దానిపై వారికి నోటీసులు ఇస్తామని అగ్రికల్చర్ ఆఫీసర్‌కు చెప్పారు. షాపు యజమానులు రైతుల వద్ద ఒక్క రూపాయి కూడా ఎక్స్‌ట్రా వసూలు చేయడానికి వీల్లేదన్నారు. రైతు తీసుకున్న వస్తువుకు తప్పకుండా బిల్లు ఇవ్వాలన్నారు. షాపు యజమానులు ఏదైతే ఏజెన్సీ నుంచి రిసీవ్ చేసుకుం టున్నారో ఆ బిల్లులు తప్పకుండా ఉంచాలన్నారు. ప్రతీ దుకాణంలో నోటీస్ బోర్డును ఉంచి స్టాక్ ఎంతుందో ఏ వస్తువుకు ఎంత రేటు అని రాసి ఉంచాల న్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే షాపులను సీజ్‌చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



న్యాయవాది హనుమంత్ రెడ్డికి ఘన సన్మానం

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కోర్టులో ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. 1956 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న న్యాయవాది ఎల్. హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సూర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, అశోక్ న్యాయవాదులు పాల్గొన్నారు.



ఆవిర్భావ ఉత్సవాలను మరిచిన మల్చేల్మా సహకార బ్యాంక్

నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కన్నుల పండుగ్గా నిర్వహించాలచి ప్రభుత్వ ఆదేశాలున్నా.. మల్చల్మా సహకరా సొసైటీ బ్యాంకులో మాత్రం వేడుకలను నిర్వహించలేదు. ఆవిర్భావ వేడుకల్లో అన్ని ప్రభుత్వ, ప్రజా సంబంధమైన కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని అలపించగా, మల్చేల్మా సహకార బ్యాంక్ లో జాతీయ జెండాను ఎగురవేసే సంగతి అటుంచిన కనీసం సొసైటీ కార్యాలయాన్ని తెరవకపోవడం విడ్డూరం. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను పాటించని మల్చేల్మా సహకార బ్యాంక్ సొసైటీ కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై స్థానిక మల్చేల్మా సొసైటీ బ్యాంక్ చైర్మన్ బుచ్చిరెడ్డిని సంప్రదించగా.. తమకు సమాచారం లేదని చెప్పగా, వైస్ చైర్మన్ షేక్ ఇమాం పటేల్ ని సంప్రదిస్తే తమకు ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఆహ్వానం లేదన్నారు. ఇంత ముఖ్యమైన రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను నిర్వహించని సొసైటీ కార్యదర్శి కేశవ రెడ్డి తన సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకోవడం విశేషం. ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోయినా కనీసం అధికారులు వేడుకలు నిర్వహించాలనే ఇంగిత జ్ఞానన్ని మర్చిపోవడం విడ్డురం. అధికారులు ఈ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటారో లేక ఏమి కాదని పెడచెవిన పెడతారో వేచి చూడాలి.



ఈషా పటేల్ సోదరి వివాహ వేడుకకు హాజరైన ప్రముఖులు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఈషా పటేల్ సోదరి వివాహానికి స్ట్రీట్ చిల్డ్రన్ ఫౌండేషన్ అధ్యక్షులు రాజేష్, బీఆర్ఎస్ యువజన నాయకులు సంగమేశ్ హాజరయ్యాయిరు. వారితోపాటు ఆకాష్ గణేష్ రాజు మోహన్ ఫిరోజ్ పటేల్ హైమోద్ పటేల్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సంజీవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

నవతెలంగాణ-కల్హేర్



ఇప్పటివరకు ఒక్కసారి కూడా నారాయణఖేడ్ నియోజకవర్గానికి మంత్రివర్గంలో చోటు దక్కలేదని.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఇప్పటికైనా నారాయణఖేడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కల్హేర్ మండల మాజీ ఎంపీపీ అధ్యక్షులు అంతన్నగారి మల్లేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం నుంచి ఇప్పటివరకు ఎన్నో పర్యాయాలు నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన కీర్తిశేషులు అప్పారావు, శంకర్, కీర్తిశేషులు కిష్టారెడ్డి, సురేష్ సెట్కార్‌లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలు అందించారని కానీ.. వారికి ఒక్కసారి కూడా మంత్రి పదవీ దక్కలేదన్నారు. వెనకబాటుకు గురైన నారాయణఖేడ్ నియోజకవర్గం అభివృద్ధి జరగాలన్న, ఇక్కడ యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా ఖేడ్ ఎమ్మెల్యేకు మంత్రి పదవీ ఇవ్వాలన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సోమవారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖలకు చెందిన అధికారులు ఉదయాన్నే జెండా ఆవిష్కరించారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి.. పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అవతరించి పది వసంతాలు పూర్తి చేసుకొని, నవ శకానికి నాంది పలుకతూ పదకొండో వసంతంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలన సౌలభ్యం కొరకు కొత్త జిల్లాలు ఏర్పడి, కొత్త కలెక్టరేట్స్, కొత్త జిల్లా పోలీసు కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం వలన, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయన్నారు. పోలీస్ శాఖ మరింత సమర్ధవంతంగా విధులు నిర్వహించడానికి నూతన వాహనాలను అందించడం జరిగిందని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నా బాధ్యత అని ప్రతి ఒక్క పోలీసు అధికారి, యువత భావించాలన్నారు. ఎంతోమంది అమరుల బలిదానాలు, మహనీయుల త్యాగ ఫలమే తెలంగాణ రాష్ట్రం అని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉండి, అభివృద్ధిలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపైన ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి కళ్యాణి, డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ నవీన్, లాలూ నాయిక్, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, డీపీఓ సూపరింటెండెంట్ వెంకటేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.డి మహబూబ్ ఖాన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సీపీఐ ఎన్నో క్రియాశీల ఉద్యమాలు చేసిందన్నారు. పార్టీ జాతీయ సమితి నుంచి తెలంగాణ గ్రామ శాఖల వరకు ఒకే నినాదంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా గ్రామ గ్రామాన బహిరంగ సభలు నిర్వహించిందన్నారు. కాగా వచ్చిన తెలంగాణలో ప్రజలకు నీళ్ల నిధులు నియామకాలు అందించడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఒక భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు రవి శ్రీనివాస్, కృష్ణా, మహేష్, అజయ్, కాజా, తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ : జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి జెండా ఆవిష్కరించగా టీఎస్‌ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు మహంకాల్ సుభాష్ గుప్తా, అల్లాడి నర్సింలు, మహమ్మద్ తంజీంలతోపాటు వివిధ పార్టీల నాయకులు మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్లో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి జెండా ఆవిష్కరించగా సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ రాజు జెండా ఎగరవేయగా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ కమిటీలో కమిటీ చైర్మెన్ సాయి చరణం జెండా ఆవిష్కరించగా డైరెక్టర్లు పాల్గొన్నారు. ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలో డిప్యూటీ మహమ్మద్ సాబీర్, పంచాయత్ రాజ్ కార్యాలయంలో దీప్తి వినోద్, ఆర్‌అండ్‌బి కార్యాలయంలో దీప్తి నర్సింలు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్, స్థానిక కోర్టు ఆవరణలో జడ్జ్ సూరి కృష్ణ, ఆర్టీవో కార్యాలయంలో ఆర్టీవో శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ లు జెండాలు ఎగరవేయగా ఆయా కార్యాలయ సిబ్బంది పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐడీఏబొల్లారం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని జ్యోతి థియేటర్ ఎదుట మున్సిపల్ కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి, మున్సిపల్ శాఖ అధ్యక్షుడు పి.జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అమరవీరుల త్యాగాలకు నివాళి అర్పిస్తూ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమం వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నీహారిక, జయమ్మ, గోపాలమ్మ, రాధా, చంద్రయ్య, స్థానిక నాయకులు సంపత్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లగూర్ల లక్ష్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, చంద్రారెడ్డి, కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి, రాజ్ గోపాల్, పాండు, మోహన్ రెడ్డి, తాహీర్, దిన నాథ్, భాస్కర్, నర్సింహారాజు, ధర్మారావు, రాజు, నరేందర్, రవితేజ, శ్రీకాంత్ రెడ్డి, శ్రీను, శంకర్, నవీన్ రెడ్డి, దిగంబర్, శేఖర్, ఇమ్రాన్, సందీప్, శైలేష్, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆక్స్ఫర్డ్ హైస్కూల్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి జెండా ఎగురవేశారు.కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవ్, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివపేట : స్థానిక సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ మహేష్ గౌడ్ జాతీయ జెండా ఆవిష్కరించి, తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10ఏండ్లు పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తాజుద్దీన్ మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం నాడు సకల జనులంతా ఉద్యమించారన్నారు. ఈ ఉద్యమంలో దాదాపు 1200 మంది విద్యార్థులు ఆత్మ బలిదానం చేసుకున్నారని గుర్తు చేశారు. వారి త్యాగ ఫలితంగా ఏర్పడిన రాష్ట్రం 10 వసంతాలు పూరి చేసుకున్న సందర్భంగా సీపీఐ కార్యాలయంలో జాతీయ జెండా ఎగర వేసినట్టు చెప్పారు.సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు ఎండి షఫీ, సాధకలి, ముస్తఫా, దత్తు స్వామి, శివ కుమార్, యాకుబ్ అలీ, మహిళా నాయ కులు లక్ష్మి, పూల మ్మ, రైహీమా బేగం,జ్యోతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం : మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వెంకటేశం ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఎగురవేశారు. అంతేకాకుండా తహసిల్దార్, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, ఐకెపి, ఎమ్మార్సీ విద్యుత్ సబ్‌స్టేషన్, ఆయా గ్రామాల్లోని పంచాయతీలు, పశు వైద్యశాలలు, రైతు వేదికలలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ఖ్యాతిని తెలియజేస్తూ... అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ : అమీన్పూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 14 ఏండ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసిన అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందన్నారు. దశాబ్ది కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. గత నాలుగేండ్ల కాలంలో అమీన్పూర్ మున్సిపాల్టీని అభివృద్ధిలో ప్రత్యేకంగా తీర్చిదిద్దామన్నారు. అభివృద్ధిలో ప్రతీ ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ నరసింహాగౌడ్, కమిషనర్ జ్యోతి రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జోగిపేట పట్టణంలో ఆయా పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు జాతీయ జెండాలను ఎగురవేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఆయా ప్రజా సంఘాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

నారాయణఖేడ్‌రూరల్ : ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాలతో ఇందిరా చౌక్ వద్ద డీసీసీ జనరల్ సెక్రెటరీ పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బోజిరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనకు సకల జనులు చేస్తున్న ఉద్యమాన్ని చూసి.. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మున్సిపల్ వైస్ చైర్మెన్ దారం శంకర్ సెట్, కౌన్సిలర్లు వివేకానంద, రామకృష్ణ, నర్సింలు, రాజేష్, చౌహన్, మాజీద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పండరి రెడ్డి, తాయర్, ముంతాజ్, శంకర్ ముదిరాజ్, జూలా నాయక్, శెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద మున్సిపల్ మాజీ చైర్మెన్ రూబిన నజీబ్ జాతీయ జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కెసిఆర్ తెలంగాణ ప్రజల పోరాటంతో ఆవిర్భావం అయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ ప్రాణ త్యాగానికైనా సిద్ధమయ్యాడన్నారు.

మండలంలోని హనుమంతరావుపేట్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిచారు.అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు లింగం, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

కోహీర్ : మండల కేంద్రమైన కోహీర్‌తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీల వద్ద, రైతు వేదికల వద్ద, ప్రభుత్వ కార్యాలయాల్లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.బిలాల్పూర్ గ్రామంలో తహసీల్దార్ శంకర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జెండావిష్కరించారు. నర్సింలు, మాజీ సర్పంచ్ అశోక్, నసీర్, పటేల్ రాజు, తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శంకర్, ఆర్ఐ సత్యనారాయణతోపాటు ఆయా కార్యాలయాల్లో ఘనంగా ఉత్సవాలను జరిపారు.

మునిపల్లి : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ శైలజ శివశంకర్, తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ తెన్‌మొళి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మనుజ, మునిపల్లి రైతు వేదికలో ఏవో శివకుమార్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సురేష్, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగుర వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఉద్యమకారుల ఆకాంక్ష కారణంగా నెరవేరిందని, తెలంగాణ ఏర్పాటై పదేండ్లు గడి చిన నేపథ్యంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించుకోవడం మంచి పరిణామమన్నారు. అంతకు ముందు అమరవీరు లను స్మరించుకుంటూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ డాక్టర్ హరినం దన్‌రావు, ఎంపీడీఓ కార్యాలయ సూపరిండెంటెంట్ రామ లింగం, ఆర్ఐ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ లింగం, సీహె చ్ఓ మొగులయ్య, సూపర్‌వైజర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రవీందర్ గౌడ్, జిన్నారం మండల తహసీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ బిక్షపతి జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. జిన్నారం పోలీస్ స్టేషన్ లో సిఐ సుధీర్ కుమార్, ఎస్సై విజయ రావు బృందం, జిన్నారం మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎంపీపీ రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు గంగు రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి బృందం, బీజేపీ కార్యాలయం వద్ద ప్రతాప్ రెడ్డి, కురుపల్ నర్సింగరావు జగన్ రెడ్డి ,రాజిరెడ్డి మద్దూరి లక్ష్మణ రావు రాజు రమేష్ సుధాకర్ బృందం, బీఆర్ఎస్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతలు,మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో రవీంద్ర నాథ్ రెడ్డి, ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల వద్ద, జిన్నారం వెటర్నరీ కార్యాలయం వద్ద డాక్టర్ విశ్వతేజ్ ఏపీజీవీబి కార్యాలయం వద్ద మేనేజర్ రాజు నాయక్, జిన్నారం ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ లో ప్రిన్సిపల్ సార శ్రీనివాస్, జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కోమల్ తారక్,యువజన సంఘాల కార్యాలయాల వద్ద వివిధ సంస్థల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అన్ని గ్రామాల్లో ఘనంగా ఈ ఉత్సవాలను జరిపారు.

గుమ్మడిదల : మండల పరిధిలోని తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ గ్రామపంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలు చేసిన పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి వివిధ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : మండల కేంద్రంలోతహసీల్దార్, ఎంపీడీవో, హద్నూర్ పోలీస్ స్టేషన్లో, ఎంఈఓ, వ్యవసాయ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, అన్ని గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్స్, ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు. మల్గి గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచ్ మారుతి యాదవ్, స్పెషల్ ఆఫీసర్‌లు ఈ వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ అంజమ్మ, తహసీల్దార్ భూపాల్, నాయబ్ తహసీల్దార్ రాజిరెడ్డి, సీఐ నహిమొద్దిన్, ఎస్సై రామునాయుడు, ఎంపీడీవో సురేష్, ఎంఈఓ మారుతి రాథోడ్, మండల వ్యవసాయ అధికారి లావణ్య ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


















దశాబ్ది ఉత్సవాలకు బయలుదేరిన ఉద్యమకారులు

నవతెలంగాణ-సంగారెడ్డి

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలకు తెలంగాణ జాయింటి యాక్షన్ కమిటీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం తరలివెళ్లారు. అంతకుముందు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళ్లుర్పించారు. తరలి వెళ్లిన వారిలో టీజేఏసీ చైర్మెన్ వై.అశోక్ కుమార్, బి.శంకరప్ప, అనంతయ్య,ఏ న్ ఆర్,వేణుగోపాల్ , తుల్జారెడ్డి, కుమ్మరి సాయిలు, ఆర్ లక్ష్మి శ్రీధర్ మహేంద్ర,ఏ రాంచందర్,బందెన్నా గౌడ్, నవాబ్ రాచిరెడ్డి, కృష్ణ మూర్తి, నవాజ్,త్రివిక్రమ్,శ్రీకాంత్ గౌడ్,



శివమణి, గైని బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలేవి?

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి సుమారు 20 రోజులు కావస్తున్నా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియరావట్లేదని టీఎస్‌యూఎఫ్ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలింగ్ విధులు నిర్వహించిన సిబ్బందికి రెమ్యూనరేషన్ తక్కువగా ఇచ్చారని అడిగినందుకు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై అడిషనల్ రిటర్నింగ్ ఆఫీసర్ అశోక్ చక్రవర్తి, నారాయణఖేడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ రెడ్డి, నారాయణఖేడ్ సబ్ ఇన్‌స్పెక్టర్ చరణ్ రెడ్డిలు లాఠీచార్జి చేయించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మే 15న ప్రధాన ఎన్నికల అధికారికి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ లేఖ ఇచ్చిందన్నారు. అయితే అధికారులపై చర్యకు సమగ్ర రిపోర్టు కోరుతూ మే 18న సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌చ ఎన్నికల అధికారికి ఎన్నికల కమిషన్ లేఖ పంపిందన్నారు. ఎన్నికల కమిషన్ లేఖ పంపి 12 రోజులైనా ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియరా లేదని.. కావున వెంటనే సంబంధిత అధికారులపై చర్య తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కే.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్, జిల్లా కార్యదర్శులు మడుపతి నరేష్ , బి యేశప్ప, నర్సయ్యలు కోరారు.

కూచారంలో ఘనంగా తెలంగాణ రాష్ట్రఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-మనోహరాబాద్



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను మండలంలోని కూచారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోతు మంగ్యానాయక్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు డి. నరేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కేవలం కేసీఆర్ వల్లే సాధ్యమైందని తెలిపారు. ఆయన పాలనలోనే రాష్ట్రంలోని ప్రతి ఒక్క రైతు, ప్రజలు సంక్షేమంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ ఆరు నెలల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమిష్టి ఉద్యమం వల్ల సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలంతా ముందుండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉదయ:రంజన్‌గౌడ్, క్రిష్ణ, యాదగిరి, రాజునాయక్, శంకర్, రాము, మురళి, మధు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ విజయంపై హర్షం

నవతెలంగాణ -పెద్దశంకరంపేట



మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి గెలుపొందడంపై ఎంపీపీ జంగం శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 111 ఓట్లతో గెలుపొందడం సంతోషకరమని, తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందని, ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జంగం రాఘవులు, మాజీ సర్పంచ్ గజవాడ నర్సింలు, నాయకులు యాకుబ్. పండరి, వెంకయ్య తదితరులున్నారు.

అమరవీరుల ఆశయాలను సాదిద్దాం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

నవతెలంగాణ-మెదక్



అమరవీరుల ఆశయాలను సాదిద్దామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో జాతీయ పథాకాన్ని ఆవిష్కరించి సోనియా గాంధి చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎందరో త్యాగమూర్తుల ఫలితం తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. అమరవీరుల ఆశయాలను సాదిద్దాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు, కొండన్ సురేందర్ గౌడ్, బొజ్జ పవన్, జీవన్ రావ్, మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్లు లింగం, శేఖర్ శ్రీదర్ యాదవ్, మేడి మధుసూదన్, సమి, బొద్దుల క్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హఫీజ్ మొల్సాబ్, మంగ మోహన్ గౌడ్, మహిపాల్, దేవులా, శివరామక్రిష్ణ, బాని, గుండేటి శేఖర్, భరత్ గౌడ్, రమేశ్, ప్రభాకర్, రవి, బాల్ రాజ్, గూడూరి క్రిష్ణ, గూడూరి అరవింద్, రమేశ్, అశోక్, ప్రవీణ్, రాజు, కిషన్, సతీష్, కొండ శ్రీను, పురం వెంకటరమణ, రాము, గూడూరి శంకర్, గాడి రమేశ్, గాడి నవీన్, సంజీవులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం

- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్

పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం తెలిపారు. సిబ్బందికి మూడవ రాండమైజేషన్ మంగళవారం ఉదయం 5 గంటలకు అబ్జర్వర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం రెండవ దఫా శిక్షణ అందజేయడం జరుగుతుందని, కౌంటింగ్ సూపర్వైజర్లు కౌంటింగ్ అసిస్టెంట్లు మైక్రో అబ్జర్వర్లకు కౌంటింగ్ ప్రక్రియపై ముందే శిక్షణ ఇచ్చామన్నారు. మెదక్, నర్సాపూర్, సిద్దిపేట్ దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ హాల్ లను నర్సాపూర్ పట్టణంలోని బివిఆర్ఐటి కాలేజ్‌లో, సంగారెడ్డి, పటాన్‌చెరువు, నియోజకవర్గాలకు సంబంధించి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల నందు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నర్సాపూర్ బివిఆర్ఐటి ఆడిటోరియంలో ఉంటుందన్నారు. ఇప్పటికే పటిష్ఠ ఏర్పాట్లు చేయడం జరిగిందని, కౌంటింగ్ హాల్ యందు సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందని తెలిపారు. జిల్లా పరిధిలోని మెదక్ -14 టేబుల్స్, 20 రౌండ్ లు, నర్సాపూర్ 14 టేబుల్స్ -22 రౌండ్స్, సిద్దిపేట్ 14 టేబుల్స్ -20 రౌండ్లు, దుబ్బాక -14 టేబుల్స్ 19 రౌండ్స్, గజ్వేల్ -15 టేబుల్స్ 22 రౌండ్స్, పటాన్ చెరువు- 18 టేబుల్స్ 23 రౌండ్స్, సంగారెడ్డి 14 టేబుల్స్ 21 రౌండ్స్, పోస్టల్ బ్యాలెట్ 18 టేబుల్స్ 2 రౌండ్స్ మొత్తం 103 టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్ 2 రౌండ్లలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌పై సమస్యలుంటే పిర్యాదు చేయవచ్చు

- కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్‌పై సమస్యలుంటే నేరుగా ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఫిర్యాదు చేయవచ్చుని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 4 వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌పై మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల ప్రజలు సమస్యలుంటే నేరుగా కలెక్టర్ కార్యాలయ గెస్ట్ హౌస్ సూట్ నంబర్ 2 లో ఉన్న కౌంటింగ్ అబ్జర్వర్ సమన్ జీత్ సెన్ గుప్త కు పిర్యాదు చేయవచ్చని లేదా ఫోన్ నంబర్ 7815906368లో పిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సంగారెడ్డి, పటాన్ చెరువు నియోజకవర్గాల ప్రజలు కౌంటింగ్ అబ్జర్వర్ వి.ఎం ప్రజాపతి కి నేరుగా మెదక్ కలెక్టరేట్ సూట్ నంబర్ 3 లో పిర్యాదులు చేయవచ్చని లేదా 7815905679 కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్ కురుకోటి కలెక్టరేట్ సూట్ నెంబర్ 1లో నేరుగా సంప్రదించి ఫిర్యాదులు చేయవచ్చని లేదా ఫోన్ నంబర్ 9652875704 లో సంప్రదించవచ్చని. తెలిపారు.

రక్తనమూనాల గుర్తింపు శిబిరం

నవతెలంగాణ-మనోహరాబాద్



మనోహరాబాద్ మండల కేంద్రంలో సేవా భారతి మనోహరాబాద్ శాఖ ఆధ్వర్యంలో రక్త ఘట సూచి నో యువర్ బ్లడ్ గ్రూప్ క్యాంపు నిర్వహించారు. ఇందులో దాదాపు 100 మంది యువకులు తమ రక్తం నమూనాలు ఇచ్చి ఏ గ్రూపో తెలుసుకున్నారు. ఇది భవిష్యత్తులో ఎవరికైనా ఆపదలో ఉన్నప్పుడు తొందరగా వారికి కావాల్సిన రక్తాన్ని ఇవ్వడానికి ఈ గ్రూపింగ్ ఉపయోగపడుతుందని క్యాంపు నిర్వహించడం జరిగిందని సేవా భారతి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన రక్తఘట సూచి కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మైపాల్ రెడ్డి పాల్గొని రక్త నమూనాలను పరీక్షించుకున్నారు.ఈ కార్యక్రమంలో సేవా భారతి కమిటీ సభ్యులు పోలీస్ వెంకట్ రెడ్డి, అనిల్, మణివర్ధన్, అరవింద్, పవన్, గణేష్, సాయి, గ్రామ కార్యదర్శి మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు..

దశాబ్ది సంబురం..

- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- రెపరెపలాడిన మువ్వన్నెల త్రివర్ణ పతాకం

నవతెలంగాణ- మెదక్



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకలు ఆదివారం జిల్లాలో సంబురంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మువ్వన్నెల త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. మెదక్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ ఛైర్పర్సన్ హేమలత, మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, టీఎన్జీఓ భవన్ వద్ద టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, బిజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలి

- పేట ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



పెద్ద శంకరంపేట మండల పరిధిలోని అన్ని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పెద్ద శంకరంపేట ఎంపీడీవో రఫిక్ ఉన్నీసా పేర్కొన్నారు. ఆదివారం పెద్ద శంకరంపేటలోని బుగుడాల గల్లి. ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న పనుల గురించి ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. తొందరగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యకమంలో పేట ఈవో వెంకట రాములు ప్రధానోపాధ్యాయురాలు స్వప్న స్థానికులు నారాయణ ఆనంద్ తదితరులు ఉన్నారు.

అంబరాన్నంటిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ పట్టణంతోపాటు ఆయా గ్రామాలలో ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయం ముందు జాతీయ జెండాలు ఎగరవేశారు. నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి, తాసిల్దార్ కార్యాలయం ముందు తాసిల్దార్ కమలాద్రి, ఎంపీడీవో కార్యాలయం ముందు ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు వైస్ ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు, పోలీస్ స్టేషన్ లో సీఐ జాన్ రెడ్డి, పంచాయతీ రాజ్ కార్యాలయం ముందు డి ఈ రాధిక, పిఎసిఎస్ కార్యాలయం ముందు పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, కాంగ్రెస్ కార్యాలయం ముందు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి లు జాతీయ జెండాలు ఎగురవేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల ముందు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాలను ఎగరవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

నవతెలంగాణ-మనోహరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో బాగంగా తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాతీయ పతాకాలను ఆవిష్కరించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం నుంచే గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంది. మనోహరాబాద్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిలతో పాటు గ్రామ పంచాయితీల వద్ద కార్యదర్శులు జాతీయ జెండాలను ఎగురవేశారు. అలాగే తూప్రాన్‌లో తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేష్‌యాదవ్‌లతో పాటు గ్రామాలలోని గ్రామపంచాయితీల వద్ద కార్యదర్శులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

నవ తెలంగాణ-టేక్మాల్

మండలంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణ, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి స్వప్న, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో రాంప్రసాద్, సొసైటీ కేంద్రం వద్ద సిఇవో వేణుగోపాల్, మండల సమాఖ్య కేంద్రం వద్ద అధ్యక్షురాలు నర్సమ్మ, పశువైద్య కేంద్రం వద్ద డాక్టర్ రమేష్, టేక్మాల్ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపిడివో రియాజోద్దిన్, ఆయా కార్యాలయాల వద్ద శాఖల అధికారులు జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపిటిసిల ఫోరమ్ ఉపాధ్యక్షురాలు నిమ్మ వాణి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, బిఆర్ఏస్ మండల అధ్యక్షులు విరప్ప, బీజేపీ మండల అధ్యక్షులు నవీన్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నార్సింగి

మండల వ్యాప్తంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి చిందం సబిత రవీందర్, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ షేక్ కరీం, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్, గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద పంచాయితీ కార్యదర్శులు జాతీయ జెండాను ఆవిష్కరించి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో ఉద్యమకారులు దశల వారీగా సాగిన రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆత్మ బలిదానానికి నిదర్శనం ఈ ప్రత్యేక రాష్ట్రమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుజాత శంకర్, ఎంపీవో నరేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఏపీవో రాజేశ్వర్ గౌడ్, టిఏ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -వెల్దుర్తి

ఎంతోమంది అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఆ సిద్ధించిన తెలంగాణ శతాబ్ద ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలాపించారు. ఆయా గ్రామపంచాయతీలో తాజా మాజీ సర్పంచులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి తహశీల్దార్ కార్యాలయంలో ఇన్చార్జి తహశీల్దార్ ప్రభుదాస్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ నవతా గౌడ్ ప్రభుత్వ కార్యాలయం అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తాజా మాజీ సర్పంచులు జాతీయ జెండా ఎగరవేసి జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి మాట్లాడారు. ఎంతోమంది అమర వీరుల త్యాగ ఫలితంగానే తెలంగాణ ఆవిష్కరించిందన్నారు. వారి త్యాగ ఫలాలను గుర్తు చేస్తూ ఇచ్చిన తెలంగాణ సోనియా గాంధీకి ఎంతో రుణపడి ఉంటామన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి నరసింహారెడ్డి బి ఆర్ఎస్ పార్టీ ఎంపిటిసి మోహన్ రెడ్డి ప్రజా ప్రతినిధులు అధికారులు అధకారులు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ- నిజాంపేట:

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ మేరకు పలు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ.సందర్భంగా నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దేశెట్టి సిద్ధిరాములు, నిజాంపేట గ్రామపంచాయతీ ముందు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి మండల తహశీల్దార్ సురేష్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పాపన్నపేట

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు పాపన్నపేట మండలంలోని ప్రతి గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ చందన ప్రశాంత్ రెడ్డి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన అనంతరం ఉద్యమంలో పోరాడిన, అమరుల సేవలను కొనియాడారు.

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

హవేలీ ఘనపూర్ మండలంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేసి ఘనంగా తెలంగాణ ఆవిర్భా వ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేరి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తొలి దశ పోరాటం నుండి మలిదశ పోరాటం వరకు ప్రాణాలు అర్పించి తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. నేడు దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణ,ఎంపీడీవో రవి ఈశ్వర్ గౌడ్,ఎస్సై ఆనంద్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి నాగ మాధురి, ఇన్చార్జి ఏపీవో లక్ష్మణ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, ఎంపీటీసీ రాజయ్య, నాయకులు సిద్ది రెడ్డి, ప్రవీణ్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



















మండలంలో ఇంటింటికి డీసీసీబీ సేవల ప్రచార కార్యక్రమం

- గోడ పత్రిక, కరపత్రిక ఆవిష్కరించిన ప్యాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణ రెడ్డి

నవతెలంగాణ-మనోహరాబాద్



తూప్రాన్ మండల కేంద్రంలోని డీసీసీబీ జూన్ నెల మొత్తం ఇంటింటికి బ్యాంక్ అందించే సేవలపైన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు బ్రాంచి మేనేజర్ ప్రసాద్ గౌడ్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను, గోడ పత్రికలను తూప్రాన్ ఉమ్మడి మండలాల పిఎసిఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణ రెడ్డి చేతులమీదుగా, వైస్ చైర్మన్ దీపక్ రెడ్డి, డైరెక్టర్లు సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, హెడ్ ఆఫీస్ సంగారెడ్డి వారి ఆదేశాల ప్రకారం జూన్ నెల మొత్తం ఇంటింటికి తిరుగుతూ బ్యాంక్ అందించే సేవలపైన అవగాహన కల్పిస్తూ సహకార సర్వేను చేస్తూన్నట్లు తెలిపారు. బ్యాంక్ అందించే ప్రస్తుత సేవలతో పాటూ, వారికి కావల్సిన ఇతర సేవలను కూడ ఇట్టి సర్వే రిపోర్ట్‌లో కాని లేక తమ అభిప్రాయలను అధికారుల ముందు తెలుపవచ్చునని, సేకరించిన అభిప్రాయలను పొందుపరిచి తదుపరి కార్యచరణ కొరకై హెడ్ ఆఫీస్ సంగారెడ్డి పంపడం జరుగుతుందని తెలిపారు. దీనితో పాటు జూన్ నెలలో నూతన ఖాతా తెరవడం కాని డిపాజిట్ చేసినవారికి 2 లేదా 4 లక్షల వరకు ఉచిత భీమా సదుపాయంను సంవత్సరం పాటు ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పది సంవత్సరాలలోపు పిల్లలకుగాను సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ స్కీంను నూతనంగా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపినారు. ఈ నూతన డిపాజిట్ స్కీం ప్రత్యేకతలు 8% అధిక వడ్డీతో పాటూ 9 సంవత్సరాలలో మీరు డిపాజిట్ చేసిన మొత్తానికి రెట్టింపు పొందవచ్చునని తెలిపారు. చిన్న మొత్తాల పొదుపులో భాగంగా లక్షాధికారి కండి స్కీంలో నెలకు 600/- చెల్లించి లక్ష మెచ్యూరిటీ వచ్చే పథకం ఉంది అని తెలిపారు. పైన తెలిపిన కొత్త అవకాశాలను వినియోగించుకోవడంతో పాటు, ప్రజలందురు సర్వేకు సహకరించాలని ఈ సంధర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బందితో పాటు, సంఘ సిబ్బంది, ఖాతాదారులు, ఇతరు ప్రముఖులు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-నార్సింగి

సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన దశాబ్ది ఉత్సవాలకు మెదక్ జిల్లా టీజేఏసీ అధ్యక్షుడు కొండాపురం బాల్ రాజ్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష మేరకు సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ వారికి జోహార్లు పలికారు. ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ చెప్యాల బాలాజీ, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ళ చిన్నకృష్ణా గౌడ్, మండల మైనారిటీ అధ్యక్షుడు రఫీఖ్, నర్సంపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు అన్వర్, మాజీ ఉప సర్పంచ్ రుక్ముద్దీన్, కొండాపురం రాజు గౌడ్, అంచనూరి రాజేష్, చందూ యాదవ్, వెంకటేశం గౌడ్, యూత్ నాయకులు పసునూటి మోతీలాల్, బాలకృష్ణ గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరారు.

యన్‌సీసీ శిబిరం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

- లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్ రావు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



గజ్వేల్ స్థానిక బాలుర హబ్‌లో నిర్వహిస్తున్న ఎన్సిసి శిక్షణ శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లెఫ్టినెంట్ కల్నల్ ఏ.మధుసూదన్ రావు అన్నారు. ఆదివారం సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుతున్న యన్‌సీసీ సంయుక్త శిక్షణా శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాడేట్‌లకు యన్‌సీసీ క్యాంప్‌లో రోజూ వారీగా జరిగే శిక్షణ, వాటి ప్రాధాన్యతని వివరించమన్నారు. ఈ శిబిర శిక్షణ తప్పకుండా తమ స్వీయ క్రమశిక్షణకి మరియు భవిష్యత్తుకి ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని తెలిపారు. అదే విధంగా ఎండల తీవ్రత అధికంగా ఉన్న కారణంగా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ శిక్షణా శిబిరంలో భాగంగా దాదాపు యాభై మంది కాడేట్లు సిద్దిపేట జిల్లా రాజగోపాల్ పేట ఫైరింగ్ రేంజ్ వద్ద ఫైరింగ్ శిక్షణ తీసుకున్నట్లు యన్ సీ సీ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ అధికారిని భవాని, క్యాండిడేట్స్,తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ట్రాక్టర్, గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ-తొగుట



విద్యుత్ వైర్ షాట్ సర్క్యూట్ వల్ల మంటలు చెల రేగి ప్రమాద వశాత్తు ట్రాక్టర్, పశువుల మేత గడ్డివాం దగ్ధం అయిన సంఘటన మండలంలోని లింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం బాధితుడు దాసని మహిపాల్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మహిపాల్ బోర్ మోటార్ వేసేందుకు వెళ్ళాడు. బోర్ మోటార్ స్టాటర్ ప్రారంభించగానే వైర్లు షాట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ఎంత ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. మంటలకు గాలి తోడు కావడంతో మరింత వేగంగా మంటలు వ్యాప్తి చెంది అక్కడే ఉన్న జాండీయర్ ట్రాక్టర్, గడ్డివాం, డ్రిప్ పైపులు పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. బాధితునికి దాదాపు రూ. 3.50 లక్షల ఆర్థికంగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తరగతి గదుల్లోనే విద్యార్థుల భవితవ్యం

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



పాఠశాల తరగతి గదుల్లోనే విద్యార్థుల భవితవ్యం రూపుదిద్దుకుంటుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థినులకు నోట్ బుక్స్, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి ఎందరో మహానుభావులు ఉన్నత స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు పనులు చేపట్టామన్నారు. జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సిద్దిపేట
4
సోమవారం | 03 జూన్ 2024 | www.navatelangana.com

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పదేండ్ల పండుగ

నవతెలంగాణ-మర్కుక్



అమరవీరుల త్యాగం వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అధ్వర్యంలో రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, సీనియర్ నాయకులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సుగుణాకర్ రెడ్డి, ర్యాకం యాదగిరి, మొర్సు శ్రీనివాస్ రెడ్డి,గుర్రాల నర్సింలు, వనం అంజనేయులు, జితేందర్ రెడ్డి, మొండి బిక్షపతి, బింగి శ్రీశైలం యాదవ్, సింగం వెంకటేష్, మాడమైన కిష్టయ్య ప్రభాకర్, తిరుపతి రెడ్డి, పుట్ట నర్సింలు, తదితరులున్నారు.

టెన్ జిపిఏ సాధించిన విద్యార్థిని సన్మానించిన ఎంపీపీ

నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ బోప్ప కనకమ్మ నాగయ్య, కూతురు బొప్ప ప్రణీత, ఎస్.ఎస్.సి.ఫలితాలలో 10 జీపీఏ సాధించడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, ప్రణీతను శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి తల్లిదండ్రులకు. మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రేబర్తి పిఎసిఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, ఎంపీడీవో రామ్ మోహన్, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, జూనియర్ అసిస్టెంట్ ముదాసిర్, మద్దూరు పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, టైపిస్టు ఆజం, తదితరులు పాల్గొన్నారు.

బంగ్లా వెంకటాపూర్ గ్రామస్టులకు భద్రాద్రి రామాయ్య తలంబ్రాలు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం భద్రాచల రామయ్య ముత్యాల తలంబ్రాలను పంపిణి చేశారు. శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో భక్తులందరికి తలంబ్రాల విశిష్టత తెలియజేసి సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు తలంబ్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ గత సంవత్సరం కూడా ఈ గ్రామ ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. సంవత్సరం కూడా నిత్య ఆంజనేయ సేవకుడు బాకి నర్సింహులు ఆధ్వర్యంలో బంగ్లా వెంకటాపూర్ గ్రామస్తులకు అందజేశామన్నారు. ఆ భద్రాచల ముత్యాల తలంబ్రాలు పొందడం అదృష్టమన్నారు. ప్రతి సంవత్సరం ఆ భద్రాచల ముత్యాల తలంబ్రాలు పొందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో సీపీఐ కీలక పాత్ర

నవతెలంగాణ-చేర్యాల



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం చేర్యాల పట్టణ కేంద్రంలోని అంగడి బజార్‌లో జాతీయ జెండాను అశోక్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సీపీఐ జాతీయస్థాయిలో ఒకే మాట ఒకే బాటగా నిర్ణయం తీసుకొని అనేక అక్రమ కేసులు జైలు నిర్బంధాలు సైతం లెక్కచేయకుండా రాష్ట్రం సాధించేంత వరకు అలుపెరుగని పోరాటం చేసిన ఏకైక పార్టీ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిల్ యాదగిరి, రామగల్ల నరేష్, పొన్నబోయిన మమత, నంగి కనకయ్య, గజ్జల సురేందర్, రజిత, మౌనిక, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలరాజుకు అత్యవసర పరిస్థితులో రక్తం అవసరం కాగా రక్త దాతలు బొజ్జ రవికుమార్, శేఖర్‌లు రక్తం ఇచ్చినట్లు వాసవి క్లబ్ డిస్ట్రిక్ జాయింట్ ట్రెజరర్ పుల్లూరు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాన్ని కాపాడిన వారం అవుతామని అన్నారు.

మృతుడి కుటుంబానికి అర్థికసాయం

నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన బింగి నర్సయ్య శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం బీజేపీ మర్కుక్ మండల అధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, ఎంపీటీసీ చైతన్య శంకర్ రెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారితో పాటు బీజేపీ నాయకులు కిషోర్ రెడ్డి, కొండల్, పుట్ట ఆంజనేయులు, మైసిగారి బాలకృష్ణ, తదితరులున్నారు.

తెలంగాణ ఉద్యమ కారులకు సన్మానం

నవతెలంగాణ-చేర్యాల



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమకారులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.తెలంగాణ సాధన కోసం తొలి, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన పుర్మ ఆగంరెడ్డి, ఉపేందర్ రావు, అంబటి నర్సయ్య గౌడ్, దూడం అంజయ్య, లక్ష్మయ్య, అంబటి అంజయ్యగౌడ్, ఎండి. జహీరుద్దీన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు కొమ్ము రవి, మంచాల చిరంజీవులు, కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, తుమ్మలపల్లి సంజీవులు, నాయకులు కాటం శ్రీనివాస్, నీలం సన్ని, అంబాల రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండల పరిధిలోని దానంపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు కొలిపాక రాములు (102) ఆదివారం మృతి చెందాడు. రోజురోజుకు ఎండలు విపరీతంగా మండిపోతుండడంతో తట్టుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మృతునికి ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

డాక్టరేట్ పట్టా పొందిన కానిస్టేబుల్‌కు సన్మానం

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుభాష్ ఇటీవల డాక్టరేట్ పట్టా పొందడంతో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సుభాష్‌కు సీఐ ఎల్. శ్రీను, ఎస్ఐ దామోదర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

సోనియాగాంధీతోనే ప్రత్యేక రాష్ట్రం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గరిపల్లి రాములు

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



సోనియా గాంధీ తోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గరిపల్లి రాములు అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షులు కనకయ్య ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోనియా గాంధీ తోనే సాధ్యమైందని రాబోయే రోజుల్లో తెలంగాణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటి, అంజిరెడ్డి, రంగరాజు ,రవి, శ్రీనివాస్ రెడ్డి ,దేవి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

భగీరథ... నీరు వృధా ...

నవతెలంగాణ- దుబ్బాక



పురపాలిక కేంద్రం నుండి హబ్సీపూర్ వెళ్లే దారిలో రామసముద్రం చెరువు కట్ట కింద ఉన్న మిషన్ భగీరథ తాగునీటి పైపు లైను నుంచి గత కొద్ది రోజులుగా మంచినీరు వృధాగా పోతుంది. ఇప్పటికే సరిపడా నీళ్లు రాక తిప్పలు పడుతున్న పట్టణవాసులకు నీటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి ప్రదాత హరీశ్ రావు

నేడు హరీశ్ రావు జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం...

నవతెలంగాణ-సిద్దిపేట



2004లో తొలిసారిగా సిద్దిపేట శాసనసభ నియోజక వర్గం నుంచి హరీశ్ రావు ఎన్నికయ్యారు. వై.ఎస్ . రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్‌లో యువజన సర్వీసులు, ప్రింటింగ్ స్టేషనరీ శాఖ మంత్రిగా పనిచేశారు. సిద్దిపేట శాసన సభ స్థానానికి 2004 అక్టోబర్ జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి 24,827 ఓట్ల మెజార్టీతో గెలు పొందాడు. 2008లో జరిగిన ఎన్నికలలో 58,935 మెజార్టీతో గెలుపొందారు. 2009లో జరిగిన ఎన్నికలలో 64, 677 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2010లో 95,878 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014లో 93,328 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2018లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో దేశంలోని అత్యధికంగా 1.20 లక్షల మెజార్టీతో గెలుపొందారు. 2023లో జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రత్యర్థులపై సుమారు 82 వేల పైచిలుకు మెజార్టీని సాధించారు. ఎప్పుడు పోటీ చేసినా ఎన్నికలలో తన ప్రత్యర్థులకు డిపాజిట్లు రాకుండా వారి డిపాజిట్లను గల్లంతు చేశారు. వరుసగా ఏడుసార్లు ఘనవిజయం సాధించారు.

అపర భగీరథుడు, నిరంతర కృషీవలుడు, తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరగని బాటసారి, అభివృద్ధి సాధకుడు, ఓటమి ఎరుగని దీశాలి, ట్రబుల్ షూటర్‌గా మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు పేరొందారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ.. ప్రజా మన్ననలను పొందుతున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, తనను నమ్ముకుని వివిధ పనులపై వచ్చే ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తూ హరీశ్ అన్నగా నిలిచారు. సొంత పార్టీలోనే కాకుండా ఇతర పార్టీ నేతల నుంచి కూడా మన్ననలను అందుకున్న ఏకైక నాయకుడిగా హరీశ్ రావు గుర్తింపు పొందారు. నమ్మిన సిద్దాంతంతో కేసీఆర్‌కు కుడిభుజంగా, నవ రాజకీయ చైతన్య దీప్తిగా ఉన్నారు.

మంత్రివర్గంలో స్థానం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే 2004-2005 సంవత్సరంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్‌లో యువజన సర్వీసుల శాఖ మంత్రిగా పనిచేశారు. 2014-2018 మధ్యకాలంలో నీటిపారుదల, మార్కెటింగ్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా విధులు నిర్వహించారు. 2019 నుంచి 2023 నవంబర్ వరకు ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం సిద్దిపేట ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

పదవులకే వన్నెతెచ్చిన దిశాలి

హరీశ్ రావు తాను ఏ పదవులు చేపట్టినా ఆ పదవులకే వన్నె తీసుకువచ్చే వ్యక్తి. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో రోజుకు 20 నుంచి 21 గంటల పాటు పనిచేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు



నిర్మాణంలో తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు. కాళేశ్వరం నుంచి కొండపోచమ్మ ప్రాజెక్టు వరకు ఎప్పుడూ పనులు పర్యవేక్షిస్తూ , అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ, ప్రాజెక్టు నిర్మాణంలో అలుపెరుగకుండా పనిచేశారు. ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని శాఖలకు ప్రాతినిధ్యం వహించే విధంగా నిధులను కేటాయించి, తన తోటి మంత్రుల అభిమానాన్ని పొందారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కల్పించే విధంగా విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారు. మహిళలకు ప్రతి మంగళవారం కొన్ని ప్రత్యేకంగా ఎన్నుకున్న ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్సలను అందిస్తూ మహిళల పక్షపాతిగా నిలిచారు. ఇలా తాను ఏ బాధ్యతలు చేపట్టినా ఆ బాధ్యతలకు వన్నె తెచ్చే విధంగా పనిచేశారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు ఒక పెద్ద అన్నగా, ఒక పెద్ద దిక్కుగా నిలిచారు. ఇలానే సేవ చేస్తూ, నిండు నూరేళ్లు జీవించాలని హరీశ్ రావును జన్మదిన సందర్భంగా ప్రజలు ఆశీర్వదించారు.



కేసీఆర్ కృషితోనే రాష్ట్ర సాధన

- ఎఫ్డిసి మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి

నవ తెలంగాణ- గజ్వేల్



తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి, ఎందరో ఉద్యమకారుల ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులలో ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ త్యాగదనులు ఎందరో అమరవీరుల ప్రాణార్పణ చేసిన సందర్భంలో వారికి నివాళులు అర్పిస్తూ అలాగే ఈ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అలాగే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో అమరవీరుల త్యాగ ఫలితమే ఈ తెలంగాణ రాష్ట్రమని 2001 నుంచి ఉద్యమాన్ని ఊపిరిగా జరిపి తెలంగాణ ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, సకల జనుల సమ్మె తోటి ఉద్యమాన్ని ఉధృతంగా చేసి అందరి నాయకులను మెప్పించి సాధించుకున్న రాష్ట్రం ఈ తెలంగాణ రాష్ట్రమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీర్, మాజీ మున్సిపల్ గాడి పల్లి భాస్కర్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, ఆకుల దేవేందర్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అధ్యక్షుడు, ఐ వి ఎఫ్ జిల్లా యూత్ అధ్యక్షుడు . సంతోష్ గుప్తా, టిఆర్ఎస్ నాయకులు తోట అమరేందర్ రావు, జయసింహారెడ్డి, కొమరవెల్లి ప్రవీణ్ కుమార్, రాజారాం, మసూన భాస్కర్, విష్ణు, బిక్షపతి, దయనంద్, ప్రమోద్, సంజీవులు, ఉత్తునూరి సంపత్, రామకృష్ణ, శేఖర్, భాను పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం

- మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి.

నవతెలంగాణ-తొగుట



61 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసి దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెంకట్రావు పేట గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ, దశాబ్ది దినోత్సవం సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్యతో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను సాకారం చేయడంతో పాటు అభివృద్ధి సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నూతన పంచాయతీ రాజ్ చట్టం తీసుకువొచ్చిన కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించి వాటి బలోపేతం కోసం కృషి చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పాత్కుల ఎల్లయ్య, నాయకులు డబ్బికారి పెంటోజీ, సిరిసిల్ల రాజేష్, ఈదుగాళ్ల పర్శరాములు, బండారు స్వామి గౌడ్, సుతారి రాములు, పాత్కుల బాలేష్, బెజ్జనమైన కనక రాజు, ఎర్రోళ్ల నాగయ్య, ఎండీ జహంగీర్, బాల య్య, పాత్కుల మల్లేశం పాల్గొన్నారు

బాధితుడికి మొబైల్ అందజేసిన ఎస్ఐ

నవ తెలంగాణ-రాయపోల్



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీతో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తిరిగి బాధితుడికి అప్పగించడం జరిగిందని ఎస్సై రఘుపతి అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి మొబైల్ ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కిచ్చిగారి అశోక్ తన ఫోన్‌ను రాయపోలుకు వచ్చే మార్గమధ్యలో నెలరోజుల క్రితం పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం రాగానే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ ను స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ అందజేయడం జరిగిందన్నారు. పోలీసుల సేవల పట్ల ఫిర్యాదుదారుడు సంతృప్తి వ్యక్తం చేస్తూ పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్న గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనంగా ఎత్తుకొనిపోయిన, వారు వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చని, తద్వారా కోల్పోయిన మొబైల్ ఫోన్ తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఈ పోర్టల్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన నేత కేసీఆర్

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ మండలం అహ్మదిపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్ర సమితి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 22 ఏండ్ల ప్రస్థానంలో నాటి నుంచి నేటి వరకు భారత రాష్ట్ర సమితికి అండగా ఉంటున్న పార్టీ శ్రేణులకు, ప్రజలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణను సాధించి.,స్వరాష్ట్రంలో తొట్టతొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో దశాబ్దకాలం పాటు ప్రగతిని సాధించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపిన ఘనత గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతుబంధు అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ చడా శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు



నవతెలంగాణ-కొండపాక

తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం అని కొగునూరు పల్లి మాజీ సర్పంచ్ కాచం నవీన్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఆయా గ్రామాల్లో పోటీపడి జెండాలు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. కొండపాక ఐఓఎస్ కార్యాలయం వద్ద ఎంపీపీ జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీటీసీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు. కుకునూరు పల్లి లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నవతెలంగాణ రిపోర్టర్ సంజీవ్, నరసింహారెడ్డిలతో పాటుగా మరి కొందరు జర్నలిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కందూరి అయిలయ్య, కాచం నవీన్ కుమార్‌లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని నలుమూలల విస్తరింపజేసిన జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. కుకునూరు పల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కొండపాకలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగారావు ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

సఫాయి కార్మికుడిని పరామర్శించిన ఎంపీటీసీ



నవతెలంగాణ-మిరుదొడ్డి

సఫారీ కార్మికుడు పరశురాములు తల్లి మరణించడం బాధాకరమని ఎంపీటీసీ నర్సింహులు అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సఫాయి కార్మికులుగా పనిచేస్తున్న భూంపల్లి పరశురాముల తల్లి రాజవ్వ ఇటీవల మరణించారు. మిరుదొడ్డి ఎంపీటీసీ సుతారి నరసింహులు, ధర్మారం లక్ష్మి మల్లయ్యలు ఈ విషయం తెలుసుకుని పరశురాములు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మనో ధైర్యాన్ని నింపి వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు తోకల నగేష్ రెడ్డి, గొల్ల రాములు, సిరినేని వెంకటయ్య, ఎలుముల శేఖర్, గొట్టం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

గజ్వేల్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ అభివృద్ధి కాంగ్రెస్తోనే సాధ్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా స్థానిక ఇందిరాపార్క్ చౌరస్తాలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గజ్వేల్ అభివృద్ధి జరగలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. దేశంలో కాంగ్రెస్ రానున్నట్లు ఆయన జోష్యం చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాయకులు సర్దార్ ఖాన్, పట్టణ అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, నాయకులు మల్లారెడ్డి, నాగరాజు గౌడ్, మామిడి కృష్ణ, భూమిరెడ్డి, సమీర్, సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, గంగిశెట్టి రాజు, నక్క రేగొండ, రమేష్ గౌడ్, అజ్గర్, వహీద్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 03 జూన్ 2024 | www.navatelangana.com

ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెడ్పి కార్యాలయ ఆవరణలో జెడ్పి చైర్ పర్సన్ రోజా శర్మ జాతీయ జెండాను ఎగరవేశారు. అంతకుముందు జాతీయ నాయకుల, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసిలు, జెడ్పి కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ ఆఫీస్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీ కార్యాలయంలో..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి పూజల హరి కృష్ణ, నాయకులు అత్తు, గంప మహేందర్ రావు, దరిపల్లి చంద్రం, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, బొమ్మల యాదగిరి, కాలీముద్దీన్, దాస అంజన్న, బుచ్చి రెడ్డి, సాకి ఆనంద్, రఫియొద్దీన్, కృష్ణ, లక్ష్మి, గోపి కృష్ణ, గయశుద్దీన్, మహిపాల్ రెడ్డి, సాంబ మూర్తి, మహేందర్, రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద ..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకులు దరువు ఎల్లన్న, దుర్గం భాస్కర్, మంధాల భాస్కర్లతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యమ కాలం నాటి స్మృతులను జ్ఞాపకం చేసుకున్నామని, కేవలం విద్యరుల పోరాటం, సోనియమ్మ తెగింపు తోనే తెలంగాణ వచ్చిందని అన్నారు. నాటి తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన మమ్మల్ని గుర్తించి తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు వడ్ల కొండ రవీందర్ గౌడ్, శ్రీను, పరమేష్ లు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో......

సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో 10వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. సాయి రమాదేవి త్రివర్ణ పతాకన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయవ్యవస్థలో, అన్ని రంగాలలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రములో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చందన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావని యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, పబ్లిక్ ప్రోసిక్యుటర్ వెంకట లింగం, సీనియర్ న్యాయవాదులు హరిచంద్ర, బాబు రావు, సత్య నారాయణ, ఆత్మ రాములు, దేవునూరి రవీందర్, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల మండల స్థాయి అధికారులు వారి, వారి కార్యాలయాల వద్ద, 16 గ్రామాలలో ప్రత్యేక అధికారులు, పార్టీలకు అతీతంగా పండగ వాతావరణంలా జాతీయ జెండాలను ఎగరవేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మండలాద్యక్షులు వారి వారి పార్టీ జెండాలను ఎగర వేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు చంద్రశేఖర్ రావు, డిఆర్డీవో బాలకృష్ణ, ఎంపీడీవో అఫ్జలుద్దీన్, ఎస్ఐ మధుకర్ రెడ్డి, ఎవో నాగేందర్ రెడ్డి, ఎంపీవో రాజలింగం, మండల వైద్యాధికారులు డా.శ్రీనివాస్, డా.దీప, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, కో అప్షన్ సభ్యులు లక్కాకుల సాహేరా నరేష్, ఎంపిటీసి పోరం మండలాద్యక్షులు కృష్ణ యాదవ్, ఎంపిటీసి గోలి నరేందర్, పిజి హెచ్ ఎం వెంకటేష్, కాంగ్రెస్ మండలాద్యక్షులు తాండ కనకయ్య గౌడ్, బీజేపీ మండలాద్యక్షులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వివిద గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.

నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్లు అనంతరెడ్డి, శ్యామ్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై షేక్ యూనిస్ అహ్మద్ అలీ, విద్యుత్ కార్యాలయంలో ఏఈలు సుధీర్ బాబు, శ్రీనివాసరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు సుధీర్ బాబు, రజిత, రేబర్తి పిఏసిఎస్ కార్యాలయంలో చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, మద్దూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో రామ్మోహన్, రైతు వేదికలో ఏఈఓ రాకేష్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మేక మల్లేశం, గ్రంథాలయంలో పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, బొప్ప కనకమ్మ నాగయ్య, కో ఆప్షన్ మెంబర్ ఎండి జిలాని, పిఆర్ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి, ఏపీఎం బాబురావు, పిఎసిఎస్ డైరెక్టర్ కాటం బాలయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కామిడీ జీవన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి బూర్గుశంకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, నాయకులు తాజ్ మహమ్మద్,కనక చంద్రం, బోయిని రాంబాబు, బూరుగు రాజు, పసి అహ్మద్, నవీద్, నీరటి కిషోర్, తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-దుబ్బాక

అమరుల త్యాగాల ఫలితమే బంగారు తెలంగాణ రాష్ట్రమని, గత పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్నింటా అభివృద్ధి చెందిందని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి అన్నారు.ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దుబ్బాక పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, కౌన్సిలర్లు ఆస యాదగిరి, లొంక రాజవ్వ లచ్చయ్య, పులిగారి కల్పన ఎల్లం, దుబ్బాక బాలకృష్ణ గౌడ్, దివిటి కనకయ్య, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి ఎల్లారెడ్డి, మెప్మా సీవో రేణుక, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ....

పురపాలిక కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అన్నింటా అభివృద్ధి చెందిందన్నారు. ఎంపీడీవో ఉమాదేవి, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి ఎల్లారెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద ..

పురపాలిక కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పుర ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, కౌన్సిలర్లు పులిగారి కల్పన ఎల్లం, లొంక రాజవ్వ లచ్చయ్య, ఆస యాదగిరి, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో....

పురపాలిక కేంద్రంలోని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముగంటి తరణి జాతీయ జెండాను ఆవిష్కరించారు.కోర్టు సూపరింటెండెంట్ సోమశేఖర్, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం హుస్నాబాద్‌లోని ఐఓసి కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఐఓసీ కార్యాలయంలో ఆర్‌డిఓ రామ్మూర్తి జాతీయ జెండాను ఆవిష్కరించారు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత జాతీయ జెండా ఆవిష్కరించి పట్టణ ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ తహశీల్దార్ రవీందర్ రెడ్డి, ఆర్ఐ రాజు నాయక్, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు బోజు రమాదేవి రవీందర్, బొజ్జ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం చేర్యాల పట్టణ కేంద్రంతోపాటు మండలంలోని గ్రామాలలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ సమీర్ అహ్మద్, మున్సిపల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపారాణి, ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎల్. శ్రీను, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి మండలాల పరిధిలో అన్ని ప్రభుత్వ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. తెలంగాణ కోసం అమరులైన వారికి నినాదాలు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీపీ సాయిలు, తహసిల్ కార్యాలయం ఎదుట తహసిల్దార్ గోవర్ధన్, మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పరశు రాములు, ఆబ్కారి సిఐ కార్యాలయం ఎదుట సీఐ గాయత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట వైద్యాధికారి సమీరా సుల్తానా, వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఏఈఓ నిర్మల, పిఏసిఎస్ కార్యాలయం ఎదుట చైర్మన్ రాజలింగారెడ్డి, ఐకెపి కార్యాలయం ఎదుట డిపిఎం బాలకిషన్, మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల కార్యాలయాల ఎదుట ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు జాతీయ జెండాను ఎగరవేశారు. కొండాపూర్‌లో అమరవీరుల స్థూపం వద్ద గ్రామస్తులు పూలమాలతో నివాళులు అర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని మిరుదొడ్డి అక్బర్ పేట భూంపల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది దినోత్సవం సందర్భంగా మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి, సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ , మద్యల రాజేశం , మండల అధ్యక్షులు అక్కపల్లి బాల్ నర్సాగౌడ్, భూంపల్లి భీమ్రావు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియా గాంధీకే దక్కుతుందని, అందుకే తెలంగాణ ప్రజలు సోనియా గాంధీని తెలంగాణ దేవతగా కొలుస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ ప్రజలకు దశాబ్ది శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ కోసం అమరులైన అమరుల త్యాగాలు మరువలేనిదని ఈ సందర్భంగా వారికి ఘనమైన నివాళులు అర్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రజా ప్రభుత్వం తెలంగాణ అమరవీరుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి బాల గౌడ్, తాజా మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, గుండా శంకర్, టెలికం బోర్డు మెంబర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మెర శ్రీధర్, రవీందర్ రెడ్డి, బాల్తే వెంకటేశం, మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి, ఫిషర్ మెన్ మండల అధ్యక్షుడు అన్నబోయిన చంద్రశేఖర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కమటం మల్లేశం, సేవాదళ్ మండల అధ్యక్షుడు పాతూరి భూపాల్ రెడ్డి వివిధ గ్రామ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం నంగునూరు మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. నంగునూరు మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వద్ద కార్యదర్శి వి.చంద్రకళ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయులు రామ స్వామి, తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్,వుల్లి మల్లయ్య, రైతు వేదిక వద్ద ఏఈఓ సాయి వర్మ, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ కిషన్,ప్రాథమిక సహకార సంఘం వద్ద సొసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ ఉమాపతి, మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎంపీపీ జాప అరుణాదేవి, ఐకేపీ కార్యాలయం ఎదుట మహిళా సంఘం అధ్యక్షురాలు భాగ్య లక్ష్మి, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ అనిల్ కుమార్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి,మాజీ సర్పంచ్ దేవులపల్లి యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు రహీం పాషా, ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చౌడుచెర్ల జయపాల్ రెడ్డి, ఎంపీటీసీ కోల సునీత మహేందర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు గుడికందుల పద్మకిష్టారెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేశం, వివిధ పార్టీల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేకమంది ప్రాణ త్యాగాలను చూసి చలించి పోయిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన తెలంగాణ దేవత అని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెలికాని యాదగిరి యాదవ్, అనరాజు నాగరాజు, రాగుల కృష్ణ, బాగు శ్రీకాంత్, రమేష్, రాజేశం, తుపాకుల శీను, దేవులపల్లి రాజు, రాములు, నర్సింహులు, అనిల్, ముకారాం శంకరయ్య, ప్రసాద్, నర్సింహులు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రధానాచార్యులు శ్రీమతి హరిణా పవన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు డా.ఆకుల నరేశ్ బాబు, డా.మంద సాయి నాథ్ రెడ్డి, డా.మీల శ్రీధర్, సంజయ్ కుమార్, కామారెడ్డి సరస్వతీ శిశు మందిర్ పాఠశాల కమిటీ సలహాదారు సిరిగాద శంకర్, ఎల్.ఐ.సి.గజ్వేల్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఎర్రవాడ అరవింద్, కాసమైన సందీప్, రంగాచారి, మల్లికార్జున్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో భారతీయ జనతా పార్టీ పోషించిన పాత్ర అద్వితీయమనీ, ముఖ్యంగా తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టిన సమయంలో ఆనాటి ప్రతిపక్ష నాయకురాలు శ్రీమతి సుష్మా స్వరాజ్ భారత పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడం కోసం చేసిన కృషి శ్లాఘనీయమని తెలిపారు. తెలంగాణ తొలి దశ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు ప్రొఫెసర్ జయశంకర్, చాకలి ఐలమ్మ, కొమురం భీమ్, కాసోజు శ్రీకాంత్ చారి తదితరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక గజ్వేల్ శాఖ కన్వీనర్ కాసమైన సందీప్ ముప్పై మంది విద్యార్థులకు ప్యాడ్స్ పెన్నులు తదితర వాటిని అందజేశారు.

నవతెలంగాణ-వర్గల్

మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పలు గ్రామపంచాయతీల వద్ద రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, నాయకులు అవతరణ దినోత్సవ సందర్భంగా వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. జై తెలంగాణ అనే నినాదాలు చేశారు. ఈ వేడుకల్లో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-రాయపోల్

అమర వీరుల త్యాగఫలం, ఉద్యమ పోరాటాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిస్తే మండలంలో మాత్రం నామమాత్రంగా కలతప్పినట్లుగా నిర్వహించారు. మండలంలో జాతీయ జెండా ఎగురవేసి రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ షేక్ రఘుపతి, తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ దివ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.మహారాజ్, ఐకెపి కార్యాలయంలో ఏటీఎం ప్రసాద్ రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్, కేజీబీవీ పాఠశాలలో ఎస్వో సుగంధ లత, గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎంపీడీవో బాలయ్య, మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు జాతీయ జెండాలను ఎగురవేసి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాఉండగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో మండల స్థాయి అధికారులు పాల్గొనకపోవడం విడ్డూరం. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, ఎంపీడీవో బాలయ్య, ఎంపీవో లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ముత్తాలిఫ్, కోఆప్షన్ సభ్యులు పర్వేజ్, సీసీలు కిష్టయ్య ప్రవీణ్, రవీందర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల వ్యాప్తంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అయా శాఖల అధికారులు, అయా రాజకీయ పార్టీల కార్యాలయాల్లో మండలాధ్యక్షులు జాతీయ జెండాను ఎగురవేశారు. అయా కార్యాలయాల సిబ్బంది, రాజకీయ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

తెలంగాణ రాష్ట్రఆవిర్భావ వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతు 60 ఏళ్ళ గోస, అమర వీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీ అని పేర్కొన్నారు. యువకుల ప్రాణ త్యాగాన్ని గుర్తించిన తల్లి సోనియా గాంధీ రాష్ట్రాన్నీ ఇవ్వడం గర్వకారణమన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో తెలంగాణ రాష్ట్ర ప్రజల కల సాకారం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంధారి లత నరేందర్ రెడ్డి, నాయకులు గంటా రవీందర్, యెన్నం భుపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, లింగాలకృష్ణ, పాత్కుల వెంకటేశం పి. వెంకటేష్, చిక్కుడు ఉపలయ్య, స్వామి, మాష్టి కనకయ్య, బెజ్జమైన రాములు, మిద్దె సంతోష్, ఓలపు నారాయణ, జీడిపల్లి స్వామి, చిప్ప భాస్క ర్, సుధాకర్ రెడ్డి, సతయ్య, కొండల్ రెడ్డి, కొత్తపల్లి బాను, కిషన్, నరేష్, మల్లయ్య, శ్రీకాంత్ తది తరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ పంచాయతీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు, యువజన సంఘాలు, వివిధ రకాల ప్రభుత్వ కార్యాలయాలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అమరవీరుల త్యాగ ఫలితమే ..

అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం కల సహకారం అయిందని ఎంపీపీ గంధారి లత నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భగా జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొముఠవెల్లి

మండలంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రామపంచాయతీలలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తలారి కీర్తన అధ్యక్షతన, తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో లక్ష్మీనారాయణ, మల్లికార్జున స్వామి ఆలయంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి అలూరి బాలాజీ, స్థానిక పోలీస్ స్టేషన్లో ఏ ఎస్ ఐ రామ్మూర్తి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్ఐ శ్రీనివాస్, ఆలయ ఏ ఈ ఓలు బుద్ధి శ్రీనివాస్, గంగా శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పలువురు సిబ్బంది అధికారులు పాల్గొన్నారు

నవతెలంగాణ -ములుగు

మండల కేంద్రంలో రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజి రెడ్డి, జడ్పిటిసి జయమ్మ అర్జున్ గౌడ్ ఎంపీపీ లావణ్యఅంజన్ గౌడ్ ఎంపీటీసీలు ప్రవీణ్ హరిబాబు, బి ఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు విలాసాగర్ బాలరాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సదుల శంకర్, పార్టీ నాయకులు వార్డు మెంబర్ నరేందర్ స్థానిక నాయకులు రవి రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు జెండా ఎగురవేసి రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడియాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కొండు నరసింహులు, గజ్వేల్ నియోజక నియోజకవర్గం యూత్ విభాగం అధ్యక్షులు కడపల కృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చింత గింజిరాజు, బుడిగె సంజీవులు, కాముని కాంతలా రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆటో-కార్ ఢీ, ఒకరి పరిస్థితి విషమం

నలుగురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

కారు, ఆటో ఢీకొని నలుగురికి తీవ్రగాయాలు కాగా మరొకరికి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన ఆదివారం రాత్రి మండల పరిధిలోని ఔరంగాబాద్ శివారులోని పంచముఖి కాలని, ఔరంగాబాద్ గేటు వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.



హవేళిఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నలుగురు ఆటోలో మెదక్ వైపు వెళ్తున్నారు. మెదక్ పట్టణ శివారులోని పంచముఖి కాలని వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇలిటం రాములు, సతీష్, నర్సవ్వ, స్రవంతిలతో పాటు కారు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి కాళ్లు విరిగాయి. గాజు ముక్కలు ఆటో డ్రైవర్‌కు, ఆటో డ్రైవర్ ప్రక్కన కూర్చున్న వ్యక్తికి దిగడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. హవేలిఘనపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు హవేలిఘనపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈటల రాజేందర్‌ను కలసిన బీజేపి నాయకులు

నవతెలంగాణ-మర్కుక్

మాజీ మంత్రి, మల్కాజిగిరి మెదక్ పార్లమెంటు బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను మర్కుక్ బీజేపి మండలాద్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీకి అత్యధిక స్థానాలు సాధించి దేశంలో మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల ఉపాధ్యక్షులు



తాడూరి మహేశ్ గౌడ్, నాయకులు సుర్వే కృష్ణ మూర్తి, శంకర్ రెడ్డి, కిశోర్ రెడ్డి, తదితరులున్నారు.